ప్రజాశక్తి

గురువారం 16 ఫిబ్రవరి 2023

అంగన్వాడి కేంద్రాలు తనిఖీ

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని మారుమూల దుర్గం పంచాయతీ దారగడ్డ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని నేరుగా లబ్ధిదారులకు అందజేయాలన్నారు.

తనిఖీ చేస్తున్న పిడి సూర్యలక్ష్మి

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు

సచివాలయం సిబ్బందికి ముఖ హాజరు తప్పని సరి ▶▶ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు:గిరిజన గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని తాగునీటి సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు, 11 మండలాల ఎంపిడిఓలతో కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జల జీవన్ మిషన్ పథకంలో మంజూరు చేసిన పనులను నిర్దిష్టమైన కాల పరిమితిలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి పథకాల పూర్తి డేటా ఎంపిడిఓల దగ్గర ఉండాలన్నారు. ఎంపిడిఓలు, జెజెఎం పనుల పురోగతిపై సమీక్షలు నిర్వహించాలని సూచించారు. విద్యుత్ అధికారులతో సమన్వయం చేసుకుని విద్యుత్తు మోటారు సమస్యలు పరిష్కరించాలన్నారు. పక్కా భవనాలకు ముందుగా పంచాయతీ అనుమతులు తీసుకుని నిర్మాణం, అనంతరం విధిగా ఆస్తుపన్నులు చెల్లించాలన్నారు. గృహ నిర్మాణాలను విధిగా నమోదు చేయాలని ఆదేశించారు. అవినీతికి తావు లేకుండా పన్నులు వసూళు చేయాలని స్పష్టం చేసారు. పక్కా భవనాల యజమానుల నుండి నీటి పన్ను, ఇంటి పన్ను వసూళ్లపై ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం మెరుగు పరచాలన్నారు. జెన్కో అధికారులు రూ.11 లక్షలు పన్ను చెల్లించాలని అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని రాగా నోటీసు జారీ చేసి పంచాయతీ చట్టం ప్రకారం పన్నులు వసూళ్ళు చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు కొంత మంది ముఖ హాజరు నమోదు చేయలేదని, అటువంటి వారి జీతాలు నిలుపుదల చేయాలని ఎంపిడిఓలకు సూచించారు. గ్రామ సచివాలయం సిబ్బంది సమయ పాలన పాటించకపోతే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. గిరిజన గ్రామాలకు, పంచాయతీలకు, పాఠశాలలకు, కళాశాలలకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇంటర్ నెట్ సదుపాయం కల్పించడానికి నిర్దేశించిన నమూనాలో నివేదించాలని ఎంపిడిఓలకు ఒక ప్రో ఫార్మాను అందజేసారు. మహిళా పోలీసులు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. పౌష్టికాహారం లోపంతో బాధపడే చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళా పోలీసులతో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఎంపిడిఓలకు సూచించారు. సామాజిక పింఛన్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు.

ఐటిడిఏ పిఓ రోణంకి గోపాలక్రిష్ణ మాట్లాడుతూ, తాగునీటి వనరులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. తాగునీటి బోరులు, కుళాయిలు, ట్యాంకర్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తాగునీటి నాణ్యత పరీక్షలు చేయించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ లీలా క్రిష్ణ, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్ కుమార్, 11 మండలాల ఎంపిడిఓలు, ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవి.ఎన్. అప్పారావు, డిఇలు డి. భాస్కరరావు, సత్యనారాయణ, గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఇలు, ఎఇలు తదిరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

నది నుంచి గాసీరామ్ మృతదేహాన్ని తీసుకొస్తున్న దృశ్యం

నదిలో పడవ మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒడిశా సరిహద్దు సీలేరు నదిలో బుధవారం పడవ మునిగి ఒకరు మృతి చెందారు ఒడిశా పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధి స్పిల్ వే గ్రామానికి చెందిన గాసీరామ్ ఖిల్ (60) నాటుపడవపై నదిలో చేపల వేటకు వెళ్లారు. పడవ రంధ్రాల ద్వారా నీరు పడవలో చేరుకోవడంతో పడవ ఒక్కసారిగా ఒకపక్క ఒరిగిపోయి బోల్తా పడింది. గాసీరామ్ ఈత రాకపోవడంతో నదిలో మునిగిపోయారు. సమీపంలో ఉన్న వ్యక్తులు నదిలో పడవ మునిగిపోయినట్లు గుర్తించారు. దీంతో వారి బంధువులకు, పోలీసులకు సమాచారం చేరవేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన ప్రదేశానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. ఒడిశా పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

13న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

-జిల్లాలో ఓటర్లు 11,571 -డిఆర్ఒ అంబేద్కర్

ప్రజాశక్తి-పాడేరు: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి మార్చి 13న ఎన్నిక జరుగుతుందని జిల్లా రెవెన్యు అధికారి పి.అంబేద్కర్ తెలిపారు. ఈ నెల తొమ్మిదవ తేదీన ఎన్నికలకు సంబంధించి ప్రకటన వెలువడినందున ఆ రోజు నుండి ఎన్నికల ప్రవర్తనా నియామావళి అమలులోకి వచ్చిందని, ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకొని విధులు నిర్వహించాలని బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు ఈ నెల 16న నోటిఫికేషన్ జారీ చేస్తారని, 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారని, 24న నామినేషన్ల పరిశీలన, 27వ తేదీ లోపు నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువని వివరించారు. మార్చి 13న ఓటింగ్, 16న ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. జిల్లాలో పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి 11,571 మంది ఓటర్లుగా నమోదయ్యారని, అందులో 7,894 పురుష ఓటర్లు, 3,674 మంది మహిళా ఓటర్లు ముగ్గురు ఇతర ఓటర్లు ఉన్నారని వివరించారు. జిల్లాలో 14 పోలింగ్ బూత్లు ఉండగా మరో అనుబంధ పోలింగ్ బూత్ ఏర్పాటు చేయటంతో మొత్తం 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 26 నోడల్ అధికారుల బృందాలను నియమిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసారని డిఆర్ఓ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు నోడల్ అధికారిగా ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకృష్ణ, మండల స్థాయిలో ఎంపిడిఓలు పర్యవేక్షిస్తారని, అదేవిధంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌గా మండల తహసిల్దార్లు వ్యవహరిస్తారని తెలిపారు. లా అండ్ ఆర్డర్, రక్షణ ప్రణాళికకు జిల్లా ఎస్పి సతీష్ కుమార్, జిల్లా సహకార ఆడిట్ అధికారి ప్రేమ స్వరూప రాణి, మేన్ పవర్ మానేజ్మెంట్‌ను సబ్ కలక్టర్లు వి. అభిషేక్, శుభం బన్సాల్ పర్యవేక్షిస్తారని, రవాణా నిరవహణను జిల్లా రావాణాదికారి ఎస్.లీలాప్రసాద్, ప్రజా రవాణాధికారి ఆర్ఎస్ నాయుడు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. అవసరమైన శిక్షణలు ఏర్పాటును ప్రత్యేక ఉప కలక్టర్ వివి రమణ, సిపిఒ ఎస్ ఎస్ఆర్కే పట్నాయిక్, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ పెట్టెలు నిర్వహణ సబ్ కలక్టర్ వి.అబిషేక్ బృందం, సెక్టోరల్ అధికారులుగా వ్యవసాయ, ఉద్యాన శాఖల జిల్లా అధికారులు, అరకు ఎపిడి, చింతపల్లి డ్వామా ఎపిడి, జిల్లా సహకార అధికారి, రూట్ అధికారులుగా ఐదుగురు డిఇలు, వ్యవహరిస్తారని తెలిపారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రాలు సబ్ కలెక్టర్ అభిషేక్ బృదం పర్యవేక్షిస్తుందన్నారు. మీడియా కమ్యునికేషన్, కంప్యుటరైజేషన్, హెల్ప్ లైన్, ఫిర్యాదులు, లైవ్ వెబ్ కేస్టింగ్, నెట్ వర్క్, సాంకేతిక సిబ్బంది, మైక్రో అబ్సర్వర్ల గుర్తింపు, సాఫ్ట్వేర్ ప్రక్రియ, కంట్రోల్ రూమ్, తదితర అంశాలకు సంబంధించి ప్రత్యేక నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసారని అంబేద్కర్ వివరించారు.

రెగ్యులేటరీ డ్యామ్ వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న మెంబర్ సెక్రటరీ

గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బృందం పర్యటన

ప్రజాశక్తి -సీలేరు

ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ పరిధి జలాశయాలను గోదావరి రిసోర్స్ రివర్ మేనేజ్మెంట్ మెంబర్ సెక్రెటరీ ఆర్.అజిగేసన్, సీనియర్ మెంబర్ రంగరాజన్‌తో కూడిన బృందం బుధవారం పర్యటించి అధ్యయనం చేసింది. ముందుగా మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి వివరాలను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జోలాపుట్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం వద్దకు చేరుకొని ఇరు రాష్ట్రాల అధికారులతో సమావేశమే పలు అంశాలపై చర్చించారు. గత ఒప్పందాల ప్రకారం నీటి నిల్వలు, పంపకాలు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. సీలేరు సమీపంలో ఉన్న గుంటవాడ రిజర్వాయర్, రెగ్యులేటరీ డ్యామ్‌కు చేరుకొని డ్యాముల పనితీరు తదితర అంశాలపై సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి. శ్రీధర్, ఎస్ఈ కేకేవి. ప్రశాంత్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. రెగ్యులేటరీ డ్యాం గేట్లు తుప్పు పట్టకుండా ఎప్పటి కప్పుడు పరిశుభ్రం చేయాలని సూచించారు. సీలేరులో నూతనంగా నెలకొల్పునున్న పంపు స్టోరేజీ ప్రాజెక్టు నిర్మాణపు ప్రదేశాలను, దానికి సంబంధించిన వివరాలు ఏపీ జెన్కో అధికారులు వివరించారు. స్థానిక జల విద్యుత్ కేంద్రానికి నీరుందించే ఇంటెక్ డ్యాం పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాచ్ ఖండ్ నుంచి డొంకరాయి వరకు రిజర్వాయర్ల పనితీరు, ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న నదిజలాలు పంపకాలు గత ఒప్పందాల ప్రకారంగా జరుగుతున్నాయా లేదా అనే కోణంలో తనిఖీలు చేపట్టామని తెలిపారు. అనంతరం పోల్లూరు జల విద్యుత్ కేంద్రానికి చేరుకొని, రెండో దశ నూతనంగా నిర్మాణం చేపట్టనున్న ఐదు ఆరు యూనిట్లు ప్రదేశాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీరు బి. శ్రీధర్, ఎస్ఈ సివిల్ కేకేవి. ప్రశాంత్ కుమార్, ఈఈలు బాబురావు, బాలకృష్ణ, ఏడిఈ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఉమామహేశ్వరరావు

పనులు లేకనే గిరిజనుల వలస

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - పెదబయలు :కాకినాడ జిల్లాలో ఆయిల్ ప్యాక్టరీలో మృతి చెందిన పెదబయలు మండలం పరెడ పంచాయతీ లక్ష్మీపురం బాధిత గ్రామస్తులను బుధవారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వర్‌రావు, మండల కార్యదర్శి కె.శరబన్నలు బాధిత కుటుంబాలకు పరామర్శించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన వెంటనే కాకినాడ సీఐటీయూ నాయకులు బాధితుల పక్షాన అండగా నిలిచారని తెలిపారు. లక్ష్మీపురం గ్రామంలో సుమారు 60 కుటుంబాలు నివశిస్తున్నాయని, బతుకు తెరువు కోసం కూలి పనులకు వెళ్లి విగత జీవులయ్యారన్నారు. గ్రామంలో కూలి పనులు లేక పొట్ట చేత పట్టుకొని వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. లక్ష్మీపురం గ్రామంలో 2018 నుండి ఉపాడి హామీ పథకం పనులు జరగ లేదన్నారు. పనులు కల్పించక పోవడంతో వలసలు వెళ్లి పోతున్నారన్నారు. అధికార పార్టీ నాయకులు గ్రామాలకు వెళ్లి పరామర్శించి మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. సొంత ఊర్లో పనులు ఉంటే ఆ ఐదుగురు దుర్మరణం చెంది ఉండేవారు కాదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వలసలు పెరిగి పోతున్నాయన్నారు. బాధిత కుటుంబాలకు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇంటి స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. 5 ఎకరాల భూమి ఇవ్వాలని డి మండ్ చేశారు. గ్రామాల్లో ఊపాధి పనులు చేపట్టాలని, లేకుంటే కలెక్టరు కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రాయల్టీ చెల్లించని మైనింగ్ యాజమాన్యం

ప్రజాశక్తి- అనంతగిరి:మండలంలోని వాలసి పంచాయతీ నిమ్మలపాడు కాల్ సైట్ మైనింగ్ తవ్వకాల ఒప్పందల లీజు ప్రకారం ఏపీఎండీసీకి ప్రతి నెల 22 లక్షల చొప్పున ఎనిమిది నెలలు సుమారు రూ ఒక్క కోటి 80 లక్షల రూపాయలు చెల్లించవలసిన రోయల్టిని చెల్లించకుండా చాప చుట్టేసి పరారైన మైనింగ్ యాజమాన్యం. . వివరాల్లోకి వెళితే దురియ రుక్మిణి భర్త దురియ కాసప్ప 2021లో సుమారు తొమ్మిది ఎకరాల భూ మైనింగ్‌ను ఏపీఎండీసీతో ఒప్పందం చేసుకున్నారు. 2022 మే నెల నుండి డిసెంబర్, 2023 జనవరి నెల వరకు మైనింగ్ తవ్వకాలు జరపారు. ఒప్పందం ప్రకారం ఏపీఎండీసీకి ప్రతి నెలకు రూ.22 లక్షల చొప్పున సుమారు కోటి 80 లక్షలు చెల్లించవలసి ఉంది. 2023 జనవరి నెల వరకు ఒక్క అర్ధ రూపాయి కూడా చెల్లించకుండా తట్టా బుట్టలు సర్దుకుని మైనింగ్ మాఫియా అక్కడ నుండి ఖాళీ చేసి మైదాన ప్రాంతాలకు వెళ్లి పోయారు. దీంతో ఏపీఎండిసి ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు తవ్వకాలతో స్థానికులతో ఏమైనా వ్యతిరేకత వచ్చిందా లేదా రోయల్టీ చెల్లించకుండా ఉండేందుకే పరారయ్యారా అనే దానిపై విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

కాల్‌సైట్ మైనింగ్ కొండ

రాములు ఆశయ సాధనకు కృషి

వర్థంతి సభలో సిపిఎం రంప చోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి - ఎటపాక

అమరజీవి ఇరపా శ్రీరాములు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. బుధవారం ఎర్రబోరులో సిపిఎం మండల కార్యదర్శి ఐవి అధ్యక్షతన శ్రీరాములు వర్ధంతి సభ జరిగింది. తొలుత శ్రీరాములు స్థూపం వద్ద జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పార్టీ నిర్మాణానికి, ప్రజాసేవకు శ్రీరాములు నిబద్ధతతో కడవరకు కృషి చేశారని కొనియాడారు. ఒడిదుడుకులు ఎన్ని వచ్చిన మౌలిక వసతులు కల్పించడంలో సమితి ప్రెసిడెంట్‌గా తన అధికారాన్ని ప్రజల కోసం ఉపయోగించారని గుర్తు చేశారు. ఏజెన్సీలో పనిచేసిన సిపిఎం ప్రజాప్రతినిధులంతా ప్రజాసేవకే అంకితం అయ్యారని, ఆ అమరుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని రాబోయే కాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ సంపదను కాజేస్తూ, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ బిజెపి దేశంలో అలజడులు సృష్టిస్తుందని విమర్శించారు. బిజెపి విధానాలను ప్రతిఘటిస్తూ ప్రజలను చైతన్యవంతులు చేస్తూ బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా సీపీఎం నికరంగా నిలబడి పోరాడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఐ.పద్మ, ఇరపా అజయ్, ఇరపా సత్యం, కారం జయమ్మ, జి.హరి, సుధాకర్, శ్రీను, ప్రవీణ్, కన్నయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇరపా రాములు స్తూపం వద్ద మాట్లాడుతున్న కిరణ్, పాల్గొన్న సిపిఎం నాయకులు

కలప అక్రమ రవాణాపై చర్యలు

స్కాడ్ డిఎఫ్ఓ త్రిమూర్తుల రెడ్డి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రక్షిత అటవీ ప్రాంతం నుండి కలప అక్రమ రవాణా అరికట్టేందుకు కట్టుదిట్ట చర్యలు చేపట్టినట్లు స్కాడ్ డిఎఫ్ఒ త్రిమూర్తులు రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక రేంజ్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రానున్న వేసవి దృష్ట్యా అటవీ ప్రాంత గ్రామ సమీపంలో గల మంచినీటి చెరువుల వద్దకు అడవి జంతువులు తాగునీటి కోసం తరుచూ వస్తూ ఉంటాయని, వాటిని వేటగాళ్లు వేటాడితే వారిపై కఠిన చర్యలు చేపట్టడంతో హెచ్చరించారు. తూర్పు అటవీ ప్రాంతంలో తమ సర్కిల్ పరిధిలో 200 హెక్టార్లలో టేకు, మారిజాతి వనాలను పెంచుతున్నట్లు తెలిపారు. వేసవిలో అడవులలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎక్కడైనా అడవి జంతువులను వేటాడినట్టు సమాచారం ఉంటే తక్షణం తమకు తెలియజేయాలని కోరారు. అనంతరం ఆయన రాజవొమ్మంగి రేంజ్ పరిధిలోని ఉర్లాకులపాడు ప్లాంటేషన్ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ డిఎఫ్ఒ సోమరాజు, రాజవొమ్మంగి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎం.అబ్బాయి దొర, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్కాడ్ డిఎఫ్ఒ త్రిమూర్తులురెడ్డి

అర్హత పరీక్షలకు హాజరుకావాలి

ప్రజాశక్తి -సీలేరు

ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో పాల్గొనాలంటే ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ముందుగా అర్హత పరీక్షకు తప్పనిసరి హాజరుకావాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ బాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు ముందు అర్హత పరీక్షలో భాగంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నైతికత, మానవీయ విలువలు అనే పరీక్షను బుధవారం నిర్వహించామని తెలిపారు. 37 మంది హాజరై పరీక్షలు రాయిగా, 11 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. ఈనెల 17న పర్యావరణ విద్య అర్హత పరీక్షకు విద్యార్థులు గైర్హాజరవ్వకుండా హాజరుకావాలని ప్రిన్సిపాల్ వినోద్ బాబు కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

చింతపల్లి ఎఎస్‌పి శివ కిషోర్

ప్రజాశక్తి-కొయ్యూరు

గిరిజనులు గంజాయి సాగు, రవాణా, నాటుసారా తయారీ, క్రయ విక్రయాలు తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని చింతపల్లి ఎఎస్‌పి కె.ప్రతాప్ శివ కిశోర్ హితవుపలికారు. మండలంలోని నేరెళ్ళబంద, గరిమండ, వంతమర్రి, పిట్టలపాడు, కన్నవరం, నల్లబిల్లి తదితర గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. చదువు, క్రీడలపై దృష్టి సారించాలన్నారు. చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రజలు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపాలని, చదువుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎ.స్వామినాయుడు, మంప ఎస్సై లోకేష్ కుమార్, కొయ్యూరు, మంప పోలీసు స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి శివ కిషోర్

నేడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి

రమాప్రభ నామినేషన్

- సరస్వతి పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన
- భారీగా తరలిరానున్న పట్టభద్రులు, ప్రజానీకం

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల వేదిక బలపర్చిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గురువారం నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు డాబాగార్డెన్స్ సరస్వతి పార్కు నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన జరుగనుంది. అనంతరం ఆమె నామినేషన్ వేస్తారు. ఈ కార్యక్రమానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు (ఐవి), వేదిక నాయకులు, ముఖ్యులు హాజరుకానున్నారు. రమాప్రభ సామాజిక కార్యకర్తగా ఉత్తరాంధ్రలో విశేష ప్రాచుర్యం పొందారు. ఆమెను అన్ని తరగతులవారూ ఆదరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె నామినేషన్ కార్యక్రమానికి భారీగా పట్టభద్రులు, ప్రజా సంఘాల నేతలు, ప్రజలు హాజరుకానున్నారు.

పాఠశాలల్లో లిప్ అమలుపై రాష్ట్ర స్థాయి బృందం ఆరా

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులలో పదసంపద పెంపొందించడం ద్వారా భాష నైపుణ్యాలను సమగ్రంగా అలవర్చేందుకు ప్రభుత్వం రూపొందించిన లిప్ (లాంగ్వేజ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం) అమలు తీరు పట్ల రాష్ట్రస్థాయి బృందం సంతప్తి వ్యక్తం చేసింది. పాడేరు కెజిబివి, వంట్లమామిడి ఎంపియుపి స్కూల్, మలకపొలం జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాల, మినుములూరు జియుపి స్కూల్, పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను బుధవారం రాష్ట్రస్థాయి బృందం పర్యటించింది. పరిశీలకులు ఎ.ప్రవీణ్ కుమార్, సిహెచ్ ఎన్ దొర, యూనిసెఫ్ కన్సల్టెంట్ టి.స్వాతి బృందం పాఠశాలల్లో లిప్ అమలవుతున్న తీరును పరిశీలించారు. పిల్లల విద్యా స్థాయి, తరగతి గది నిర్వహణ, బోధనలో మెలకు వలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సరైన ఉచ్చరణ, స్పెల్లింగ్ తప్పులు లేకుండా రాయడం, పదజాలం మెరుగు, ఆత్మవిశ్వాసం పెంపొందించడం, ప్రాథమిక పాఠశాల నుండి కమ్యూనికేషన్ నైపుణ్యాల అభివృద్ధి, పిల్లల స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేలా చేయడం, మంచి చేతి వ్రాత నైపుణ్యాలను మెరుగుపరచడానికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లిప్ అమలుపై పాడేరు కెజిబివి సిబ్బందితో చర్చిస్తున్న రాష్ట్రస్థాయి బృందం

నేటి నుంచి గ్లోబల్ టెక్ సమ్మిట్

- వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి
- వివరాలు వెల్లడించిన కో-కన్వీనర్ గేదెల శ్రీనుబాబు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, సీతమ్మధార

సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో ఈ నెల 16,17 తేదీల్లో గ్లోబల్ టెక్ సమ్మిట్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను గ్లోబల్ టెక్ సమ్మిట్ కో-కన్వీనర్, పల్సస్ కంపెనీ సిఇఒ గేదెల శ్రీనుబాబు బుధవారం సత్యం జంక్షన్ వద్ద ఉన్న పల్సస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. గురువారం ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, 11:15 గంటలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ఉపన్యాసం చేస్తారని శ్రీనుబాబు తెలిపారు. సదస్సుకు జి-20 దేశాలతో పాటు 25 దేశాల నుంచి దాదాపు వెయ్యి మంది వరకు హాజరవుతారని చెప్పారు. రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, రాజన్నదొర పాల్గొంటారని తెలిపారు. సదస్సులో భాగంగా అధునాతన పద్ధతిలో యూరోపియన్ టెక్నాలజీ ఉపయోగించి వ్యవసాయ ఉత్పత్తులపై చర్చ జరుగుతుంది చెప్పారు. దీనికి సంబంధించి బిజినెస్ టెక్నాలజీ సెంటర్‌ను విశాఖలో ఏర్పాటుచేసి వ్యవసాయ ఉత్పత్తుల గురించి అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఫార్మా రంగంలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ పరంగా బడ్జెట్‌ను తగ్గించి సులభ పద్ధతిలో తక్కువ ధరకు వినియోగదారులకు అందే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరుగుతుందన్నారు. టెక్నాలజీ పరమైన అంశాలు చర్చిస్తారని తెలిపారు. 200 ఫార్మా, 200 ఐటీ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారు. ఎయు విసి పివిజిడి.ప్రసాదరెడ్డి, ఐటి ఇ అండ్ సి విభాగం సెక్రటరీ సౌరభ్‌గౌర్, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కు ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ టివి,నారాయణ తదితరులు భారతదేశంలో వైద్య, ఆరోగ్య రంగం స్థితి, ఎదుర్కొంటున్న సవాళ్లు, అందుబాటులో ఉన్న వైద్యంపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మన రైతులకు యూరోపియన్ వ్యవసాయ విధానం గురించి నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిఎమ్‌డి కమోడోర్ అమిత్ రస్తోగి వివరిస్తారని తెలిపారు. ఫార్మా రంగంలో కొత్త టెక్నాలజీపై ప్రత్యేక కోర్సులు కూడా ప్రవేశపెట్టేందుకు ఈ సదస్సులో నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. టెక్ సమ్మిట్‌లో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్, నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, యూరోపియన్ బిజినెస్ అండ్ టెక్నాలజీ సెంటర్ (ఇండియా), బ్రిటిష్ హైకమిషన్ (న్యూఢిల్లీ), సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఇండియా, సివిల్20 గ్రూప్, టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ ఫోర్‌కాస్టింగ్, అసెస్‌మెంట్ కౌన్సిల్, డిఎస్‌టి, ఇండియా సంస్థలన్నీ భాగస్వాములయ్యారని తెలిపారు.

పోడు పట్టాలు మంజూరుకు కృషి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని చొంపి పంచాయితీ కేంద్రంలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు సమస్యలపై బుధవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో సబ్ కలెక్టర్ అభిషేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అభిషేక్ మాట్లాడుతూ, పోడు పట్టాల సమస్య ఉన్న వారికి తొమ్మిదవ డిఎల్సిలో పట్టాలు అందిస్తామన్నారు. పట్టాలు కలిగిన వారికి ప్రభుత్వం తరఫున రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి పట్టా మంజూరు కాకపోతే సమస్య తెలుసుకుని ఇస్తామమన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ కమిటీ గ్రామ సభ నిర్వహించి సభ ఆమోదం మేరకు 2005 ముందు నుండి సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని తీర్మానాలు చేస్తే చట్ట ప్రకారంగా వారందరికీ మంజూరు చేస్తామన్నారు. నష్టపోయిన రైతులకు ఆదుకుంటామని చెప్పారు. ఈనెల 14న మంగళవారం చొంపి గ్రామానికి చెందిన వంతల జోగులు, పెట్టేలి అప్పన్న, పెట్టేలి భీమన్న, పెట్టేలి జగ్గారావు, పెట్టేలి బాలరాజులకు చెందిన రైతుల కాఫీ, సిల్వర్, మిర్యాల తోట సుమారు 6 ఎకరాలు కాలిపోయి నష్టం వాటిల్లిందని, రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వార్డు సభ్యులు బి.కోగేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి కె.రామారావు సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వేణుగోపాల్, పంచాయతీ సర్పంచ్, సిపిఎం నాయకులు ఆ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఆందోళన చేస్తున్న విద్యార్థి కుటుంబీకులు

విద్యార్థి కుటుంబీకుల ఆందోళన

తక్షణ సాయంగా రూ.50వేలు అందజేత

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తాడిపుట్టు పంచాయతీ యూ.బొడ్డాపుట్టులో విద్యుత్ స్తంభం నేల కొరగడంతో విద్యార్థి తూబూరు ధర్మిత మృతి చెందిన విషయం తెలిసిందే. స్కూల్ ప్రదనోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడుల నిర్లక్ష్యంగా కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని, హుకుంపేట పోలీస్ స్టేషన్లలో బాధితులు ఫిర్యాదు చేశారు.ఘటనకు బాధ్యులైన హెచ్‌ఎం ప్రకాష్, ఉపాధ్యాయుడు భాస్కరరావు, మండల విద్యా శాఖాధికారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేసేంత వరకు జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టనికి అనుమతి ఇవ్వమని తల్లిదండ్రులు ఆందోళన చేపట్టడంతో జిల్లా కలెక్టర్ తక్షణ సహాయం కింద రూ.50 వేలు అందించి, తర్వాత రూ.50 వేలు ఇస్తామని హామీతో ఆందోళన విరమించారు. తర్వాత విద్యార్థి మృతదేహాన్ని దహన సంస్కరణలకు స్వగ్రామానికి తరలించారు.

అనంతరం గిరిజన సంఘం, మానవ హక్కుల విద్య బోధన, బాలల హక్కుల పరిరక్షణ వేదిక కొండలరావు, కృష్ణారావు, ఆనంద్ నేతలు మాట్లాడుతూ, బాధితులకు న్యాయం చేయాలన్నారు. బాధితులకు రూ.25లక్షల పరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

రోడ్డు పనులు ప్రారంభించాలని...

గిరిజన సంఘం ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని తూటంగి పంచాయతీ బల్లగెడ్డ పివిటిజి మారుమూల గ్రామంలో మంజూరైన నిధులతో రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ స్థానిక గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సూర్యనారాయణ మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ పథకం ద్వారా జరాయి జంక్షన్ నుంచి బల్లగెడ్డ వరకు ఈ రోడ్డు నిర్మాణానికి 2022 సంవత్సరంలో రూ.36 లక్షలు మంజరైందని చెప్పారు. నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు సత్యారావు, వి.సింహాచలం, జి అనంతరావు, టి.రమేష్ పాల్గొన్నారు.

అధ్యాపకుల నియామకానికి వినతి

ప్రజాశక్తి -అనంతగిరి: విశాఖపట్నం జిల్లా ఏపీఆర్ మారికవలస ఎస్ఒఇ బాలికల హై స్కూల్‌లో సెక్షన్ హిందీ ఉపాధ్యాయుడు, కళాశాల కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌ను తక్షణమే నియమించాలని కోరుతూ స్థానిక జెడ్పిటిసి దీసరి .గంగరాజు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, డీడీలను కోరారు. ఈ మేరకు బుధవారం ఫోనులో తెలిపి స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు.ఆ సబ్జెక్టులకు కనీస లెక్చరర్స్ లేక పోవడంతో విద్యార్థుల చదువులు ముందుకు సాగలేదన్నారు. మార్చిలో జరిగే పరీక్షల్లో ఏ విధంగా ఉత్తీర్ణత సాధించగలుగుతారని ప్రశ్నించారు. విద్యార్థులకు బోధనలు అందించి భవిష్యత్తును మెరుగు పంచాలని ఆయన కోరారు. దీనిపై ఈనెల 23న విశాఖలో జరిగే జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తావిస్తానని ఆయన అన్నారు

రక్త దానం చేయండి

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ఆరోగ్య పరిస్థితులు, అవసరాల దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు, సిబ్బంది రక్తదానం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 16న గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలన్నారు.

గిరిజన మిత్ర ఆధ్వర్యాన వైద్య శిబిరం

రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -రంపచోడవరం, రాజవొమ్మంగి

జిల్లాలోని గంగవరం మండలం చీడిపాలెం గ్రామంలో ఎస్‌కెహెచ్ హాస్పిటల్స్, గిరిజన మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధశారం వైద్య శిబిరం నిర్వహించారు. 500 మందికి పలు అనారోగ్య సమస్యలపై వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా గర్భిణుల సమస్యలు, రక్తస్రాయం, గుండె జబ్బులు వంటివాటికి వైద్యం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మిత్ర మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్ శ్రీనివాస్, వైద్యులు వెంకట కృష్ణ, ఆసుపత్రి, గిరిజన మిత్ర ఫౌండేషన్ సిబ్బంది శ్రీను, రాజు, లింగరాజు, పాస్టర్ జాన్ రాజ్, మడకం వెంకన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

సైకిల్ ఫర్ హెల్త్ ర్యాలీలో వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి వైద్యాధికారులు ఎస్‌కె.మస్తాన్, సౌమ్య ఆధ్వర్యంలో బుధవారం సైకిల్ ఫర్ హెల్త్ ర్యాలీని నిర్వహించారు. సైకిల్ తొక్కండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి, ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మస్తాన్, సౌమ్య మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు సైకిల్ ఫర్ హెల్త్ ర్యాలీ చేపట్టమన్నారు. సైకిల్ తొక్కడం వల్ల శరీరకంగా బహు ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఏవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రావు, పిఈటి కమలాకర్, హెల్త్ సూపర్వైజర్ తిరునాధ, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ విజయానికి

ఐద్వా విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బుధవారం ఐద్వా ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆరిలోవ కాలనీ, శ్రీలీలాసుందరయ్యనగర్‌లో పట్టభద్రుల ఓటర్లను కలిసి కరపత్రాలను పంచుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని అభ్యర్థించారు. ఆరిలోవ ఐద్వా నాయకులు బి.సూర్యమణి, ఎస్.రంగమ్మ, కాంతం, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

హైవే రోడ్డు నిర్వాసితులకు

పోలవరం తరహా నష్ట పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - రంపచోడవరం

జాతీయ రహదారి నిర్మాణంలో నిర్వాసితులైన వారికి పోలవరం ప్రాజెక్టు తరహా నష్టపరిహారం ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లె రెడ్డి డిమాండ్ చేశారు. రంపచోడవరం మండలం పోలవరం, చిన్న బీరంపల్లి తదితర గ్రామాల్లో గిరిజన సంఘం నాయకులు బుధవారం పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిరిమల్లె రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు నిర్వాసితులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండానే రోడ్డు నిర్మాణం చేపట్టడం దుర్మార్గమన్నారు. పోలవరం నిర్వసితులకు ఏ భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించారో? ఆ తరహా నష్టపరిహారం హైవేలో నష్ట పోయిన రైతులకు చెల్లించాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. నిర్వాసితులకు ఎటువంటి అంశాలు వర్తిస్తాయి, ఎంత నష్టపరిహారం ఇవ్వాలి అనేది తేల్చకపోవడం ప్రభుత్వం గిరిజనులకు మోసం చేయడమే అవుతుందన్నారు. లెక్కతేల్చకపోతే గిరిజనులతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గిరిజన సంఘం మండల అధ్యక్షుడు సాదల విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు నష్టపరిహారం చెల్లించడంలో చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కుంజం రామన్న దొర, కారం చిన్నబ్బులు, కారం అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న గిరిజన సంఘం నేత సిరిమల్లెరెడ్డి

ముమ్మరంగా పొగాకు కొనుగోళ్లు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

బంగారంగా పిలిచే వైట్ బర్లి పొగాకు కొనుగోలు మండలంలో బుధవారం ముమ్మరంగా సాగాయి, మండలంలోని రాజవొమ్మంగి, లబ్బర్తి, జడ్డంగి, కింద్ర, కిర్రాబు, వాతంగి, అనంతగిరి, లాగరాయి తదితర ప్రాంతాల్లో రైతులు ఈ ఏడాది సుమారు 2000 ఎకరాలకు పైగా పొగాకు పంటను సాగు చేశారు. పంటపై ఎకరాకు సుమారు రూ.50 వేలు పైబడి పెట్టుబడులు పెట్టారు. ఈ ఏడాది పొగాకు మంచి గిట్టుబాటు ధర ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడం వలన ఆశించినంత దిగుబడి రాలేదని రైతులు తెలిపారు. బుధవారం ఐటిసి కంపెనీ మండలంలోని రాజవొమ్మంగి, లబ్బర్తి, ఒట్టిగడ్డ, తదితర స్టాక్ పాయింట్ల వద్ద పొగాకు కొనుగోలు చేసింది. ఈ సందర్భంగా ఐటిసి ఏరియా మేనేజర్ తారకేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటివరకు సుమారు 200 టన్నులు పొగాకు బేళ్లు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది పొగాకు కేజీకి రూ.115 టాప్ ధర కంపెనీ నిర్ణయించడం జరిగిందన్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన పొగాకు కు కంపెనీ రెండు రోజుల్లో వారి డబ్బులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిసి సిబ్బంది వరహాలు బాబు, పుల్లయ్య, సింహాద్రి, అచ్చారావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో రైతులు విక్రయానికి సిద్ధం చేసిన పొగాకు బేళ్లు

వెట్టిచాకిరి నిర్మూలనపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మునిస్వామి

ప్రజాశక్తి- విశాఖపట్నం : వెట్టిచాకిరి నిర్మూలనపై సర్కిల్-2 సహాయ కార్మిక కమిషనర్ బుద్ధ మునిస్వామి ఆధ్వర్యంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్, గోపాలపట్నం, కరాస, సుజాతనగర్, పెందుర్తి ప్రాంతాల్లో సహాయ కార్మిక అధికారులు పి.విజయకుమార్, ఎం.పద్మావతితో పాటు గోపాలపట్నం పోలీసులతో కలిసి బృందంగా వెళ్లి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ, వెట్టిచాకిరి కార్మిక సంబంధమైనదే కాకుండా తీవ్రమైన మానవ ఉల్లంఘన నేరంగా పరిగణించి, చట్టపరంగా కేసులు, శిక్షలు తప్పవని హెచ్చరించారు. 1976 వెట్టిచాకిరి నిర్మూలన చట్టం ప్రకారం కారణమేదైనా వ్యక్తులతో బలవంతంగా పనిచేయించడం, శారీరక, మానసిక హింసకు గురిచేయడం, ఇష్టమైన చోటుకు వెళ్లి, ఇష్టమైన పనిని చేసుకునే హక్కును హరించడం, చట్టబద్ధంగా కనీస వేతనం చెల్లించకపోవడం వంటివన్నీ వెట్టిచాకిరి కిందే వస్తాయని వివరించారు. దీనికి చట్టపరంగా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా వెట్టిచాకిరి లేని రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ హెచ్‌సిలు వెంకటరావు, ఎం.శ్రీనివాస్, ఇతర సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

అటవీ నివాసిత జాతులకు

విద్యను కొనసాగించాలి

ఐటిడిఎ పిఒకు ఎంపిపి, రైతు సంఘం నేతల వినతి

ప్రజాశక్తి చింతూరు.

జిల్లాలోని చింతూరు రెవెన్యూ డివిజన్ విఆర్.పురం మండలం పరిధిలో వలసలు వచ్చి అటవీ గ్రామాలలో నివసిస్తున్న భారత గిరిజన షెడ్యూల్ తెగల సాంప్రదాయ అటవీ నివాసిత జాతులకు విద్యాభ్యాసం కొనసాగించాలని కోరుతూ బుధవారం ఐటీడీఏ పీవోకు విఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రిందట 2003 నుండి విఆర్ పురం మండలం రామవరం గ్రామపంచాయతీ అడివి వెంకన్నగూడెం గ్రామ శివారు అటవీ ప్రాంతమైన సోడేరుపాడు, చిన్నమట్టపల్లి, సున్నం మట్కా, దర్భలంక, పెద్దమట్టపల్లి, రామపురం,. బూరుగువాడ, బొడ్డి గుంపు, నాగేంద్ర పురం గ్రామాలకు చెందిన పిల్లల జాబితా, వారు అభ్యసిస్తున్న కాలేజీలు/ ఆశ్రమ పాఠశాలలు/ ప్రాథమిక పాఠశాలల వివరాలను విన్నవించారు. ఆ విద్యార్థులకు గతంలో కొనసాగించిన హాస్టల్ వసతి, అమ్మఒడి, స్కూల్ యూనిఫామ్‌లు కల్పించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. దీనిపై పిఒ సానుకూలంగా స్పందించి తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రమేష్ దేవయ్య, రాముడు, గంగరాజు, చందు, అడమయ్య పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యతపై అవగాహన

ఆవిష్కార్-2023 సదస్సులో

ఎపి ఇన్నోవేషన్ సొసైటీ సిఇఒ డాక్టర్ అనిల్‌కుమార్

ప్రజాశక్తి- మధురవాడ : విద్యార్థులు కాలేజీ దశ నుంచే సాంకేతిక నైపుణ్యతపై ప్రత్యేక అవగాహన పెంపొందిచుకోవాలని ఎపి ఇన్నోవేషన్ సొసైటీ సిఇఒ డాక్టర్ టి.అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం రుషికొండ గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ అటానమస్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించిన ఆవిష్కార్-2023ను ప్రారంభించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహిస్తున్న మూడు రోజుల సదస్సులో మాట్లాడుతూ, ఇన్నోవేషన్ ప్రాధాన్యత, ఇన్నోవేషన్ వాలీ చేస్తోన్న కార్యక్రమాలు, గ్లోబల్ సమ్మిట్ విషయాలను వివరించారు

పేటెంట్, ఇన్నోవేషన్ ప్రాముఖ్యతను గౌరవ అతిథి డాక్టర్ బి.కె..సాహూ వివరించారు. కార్యక్రమలో గాయత్రీ విద్యా పరిషత్ జాయింట్ సెక్రటరీ డి.కామేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రజని, సిఎస్‌ఈ. విభాగాధిపతి డాక్టర్ ఎన్‌వి.రమణమూర్తి, డైరెక్టర్ డాక్టర్ బివి.రమణమూర్తి పాల్గొన్నారు. మూడు రోజుల సదస్సులో కార్యక్రమాల వివరాలను జి. కల్యాణచక్రవర్తి వివరించారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యాపరిషత్ అటానమస్ కాలేజీ, ఎంపి ఇన్నోవేషన్ సొసైటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

17,18 తేదీల్లో గీతం వేదికగా

ఐపిఇఎ వార్షిక సమావేశాలు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈనెల 17,18 తేదీలలో ఇండియన్ పొలిటికల్ ఎకానమీ అసోసియేషన్ (ఐపిఇఎ) 26వ వార్షిక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కార్యదర్శి, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరక్టర్ ప్రొఫెసర్ బి.నళిని తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆంధ్రప్రదేశ్‌తో సంయుక్తంగా గీతం అతిథ్యంలో నిర్వహిస్తున్న ఈ సమావేశాలలో ప్రపంచ, భారత రాజకీయ ఆర్థిక పరిస్థితులపై దేశ, విదేశాలకు చెందిన నిపుణులు ప్రసంగిస్తారన్నారు. ప్రపంచ సంక్షోభం, భౌగోళిక రాజకీయ అంశాలు, కోవిడ్ తదనంతర పరిస్థితులు, భారత ఆర్థిక రంగం ప్రస్తుత స్థితిగతులు, రాజకీయ ప్రజాస్వామ్యం, ఆంధ్రప్రదేశ్ ప్రగతి ఎదురవుతున్న సవాళ్లు వంటి అంశాలను చర్చిస్తారన్నారు.